సాక్షి
ప్రకాశం
శనివారం । 27 । జూలై । 2024



పెండింగ్ కేసులు పరిష్కరించాలి
పెండింగ్ కేసులు త్వరగా పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని ఎస్పీ దామోదర్ పోలీసు సిబ్బందికి సూచించారు. - 8లో..



సీనియర్ సాఫ్ట్‌బాల్ జట్లు ఇవే..
సీనియర్ సాఫ్ట్‌బాల్ జిల్లా జట్లను శుక్రవారం ఒంగోలులోని ఏబీఎం డిగ్రీ కాలేజీ ఆవరణలో ఎంపిక చేశారు. - 8లో..

గరిష్టం/కనిష్టం
34/28

వాతావరణం
ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఒక్కడక్కడా చిరుజల్లులు పడవచ్చు. రాత్రికి చల్లని గాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

కలెక్టర్‌ను మర్యాద పూర్వకంగా కలిసిన ఎస్పీ



కలెక్టర్‌కు మొక్క అందిస్తున్న ఎస్పీ ఏఆర్ దామోదర్

ఒంగోలు సెంట్రల్: కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియాను శుక్రవారం నూతన ఎస్పీ ఏఆర్ దామోదర్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన ఎస్పీకి కలెక్టర్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లాలో శాంతి భద్రతలు, పోలీస్ శాఖ, పరిపాలన యంత్రాంగం మధ్య సమన్వయం, జిల్లాకు సంబంధించిన పలు అంశాలపై ఇరువురు చర్చించారు.

రూడ్‌సెట్ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ

ఒంగోలు సెంట్రల్: రూడ్ సెట్ సంస్థలో ఆగస్టు 2 నుంచి పురుషులకు కంప్యూటర్ ట్యాలిలో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ పీ శ్రీనివాస రెడ్డి తెలిపారు. శిక్షణకు ఉమ్మడి ప్రకాశం జిల్లాకు చెందిన గ్రామీణ ప్రాంత నిరుద్యోగ పురుషులు 18 నుంచి 45 సంవత్సరాల వయస్సు ఉన్న వారు అర్హులని తెలిపారు. రేషన్ కార్డు, ఆధార్ కార్డు కలిగి ఉండాలని, శిక్షణతో పాటు వసతి, భోజన సదుపాయం కల్పిస్తారని చెప్పారు. పూర్తి వివరాలకు సెల్ నంబర్: 9492583484ను సంప్రదించాలని కోరారు.

ఎయిడెడ్ సమస్యలపై ఏడీకి ఏపీటీజీ నాయకుల విజ్ఞప్తి



ఎయిడెడ్ ఉపాధ్యాయుల సమస్యలపై ఏడీకి విజ్ఞప్తి చేస్తున్న ఏపీటీజీ నాయకులు

ఒంగోలు: ఎయిడెడ్ ఉపాధ్యాయుల సమస్యలపై ఏపీ టీచర్స్‌గిల్డ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కోడూరి వెంకట్రావు, సీహెచ్ ప్రభాకర రెడ్డి శుక్రవారం జిల్లా విద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఉదయభాస్కర్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. కొమరోలు ఏబీయం ఎయిడెడ్ పాఠశాలలో పనిచేసే ఐదుగురు ఉపాధ్యాయుల వార్షిక ఇంక్రిమెంట్ల సమస్యను ప్రస్తావించారు. పుల్లలచెరువు మండలం మానేపల్లి ఎయిడెడ్ పాఠశాలలో పనిచేసే ఇద్దరు ఉపాధ్యాయుల పదవీ విరమణ సర్వీస్ రిజిస్టర్‌లను ఏజీ ఆఫీసుకు పంపాలని కోరారు. జిల్లాలో 101 మంది ఎయిడెడ్ ఉపాధ్యాయులను కౌన్సెలింగ్ ద్వారా ప్రభుత్వ పాఠశాలలకు సర్దుబాటు చేయాలని, విద్యార్థులు లేని ఎయిడెడ్ పాఠశాలల రికార్డులను మండల విద్యాశాఖ అధికారి సమీప ప్రభుత్వ పాఠశాలకు అప్పగించాలని, జీవో నంబర్ 155 ప్రకారం మండల విద్యాశాఖ అధికారులు ఎయిడెడ్ ఉపాధ్యాయుల జీతాల బిల్లుల విషయంలో తగు చర్యలు తీసుకోవాలన్నారు.

ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి

- కలెక్టర్ తమీమ్ అన్సారియా



అధికారులతో సమావేశం నిర్వహిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు అర్బన్: క్షేత్ర స్థాయిలో ప్రజా సమస్యలు పరిష్కరించడంతో పాటు ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా అధికారులకు సూచించారు. శుక్రవారం ప్రకాశం భవనంలో జిల్లా పరిషత్, సచివాలయాలు, ప్రణాళిక, ఉపాధికల్పన, నైపుణ్యాభివృద్ధి శాఖలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. దీనిలో కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ప్రజలకు చేరువ చేయాలన్నారు. నిరుద్యోగ యువతకు అందుబాటులో ఉన్న ఉపాధి అవకాశాలపై అవగాహన కల్పించి వాటికి అవసరమైన శిక్షణలు ఇచ్చి ఉపాధి కల్పించాలన్నారు. ఆయా శాఖల ద్వారా ప్రజలకు అందుతున్న సేవలు, కార్యక్రమాలపై ఆరా తీశారు. చిత్తశుద్ధితో పనిచేసి ప్రజలకు మేలు చేయాలని అధికారులకు సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. దీనిలో జెడ్పీ సీఈఓ మాధురి, డిప్యూటీ సీఈఓ హనుమంతరావు, డీపీవో ఉషారాణి, మార్కాపురం డీఎల్‌డీవో సాయికుమార్, ఎంప్లాయిమెంట్ అధికారి భరద్వాజ్, నైపుణ్యాభివృద్ధి శాఖ అధికారి రవితేజ, సీపీవో వెంకటేశ్వర్లు ఇతర అధికారులు పాల్గొన్నారు.



చిరుద్యోగులపై కూటమి కక్ష

కూటమి నేతల రాజకీయ కక్షసాధింపు చర్యలకు చిరుద్యోగులు బలవుతున్నారు. ఎన్నో ఏళ్ల నుంచి చిన్నా, చితకా ఉద్యోగాలతో కుటుంబాలు నెట్టుకొస్తున్న వారిపై వైఎస్సార్ సీపీ ముద్ర వేసి వారి పొట్టకొడుతున్నారు. అధికారులపై ఒత్తిడి చేసి ఫీల్డ్ అసిస్టెంట్‌లు, మధ్యాహ్న భోజన ఏజెన్సీలు, డ్వాక్రా వీవోఏలు, రేషన్ డీలర్లను బలవంతంగా రాజీనామా చేయిస్తున్నారు. ఉన్న చిన్నపాటి ఉద్యోగాలను కూడా కోల్పోయి.. ఇతర ఉద్యోగాలకు వెళ్లేందుకు వయోపరిమితి దాటిపోయి వారు తీవ్ర మానసిక వేదనకు గురవుతున్నారు. వందల కుటుంబాలు ఉపాధి కోల్పోయి విలవిల్లాడుతున్నాయి.

- రాజకీయ వేధింపులతో ఫీల్డ్ అసిస్టెంట్‌లు, మధ్యాహ్న భోజన ఏజెన్సీలు, డ్వాక్రా వీఓఏలు, రేషన్ డీలర్ల తొలగింపు
- వైఎస్సార్ సీపీ సానుభూతిపరులుగా ముద్ర వేసి తొలగించేందుకు ఒత్తిడి
- టీడీపీ నేతల ఒత్తిళ్లకు తలొగ్గిన అధికారులు
- ఇప్పటికే వందల సంఖ్యలో ఉద్వాసన
- తలలు పట్టుకుంటున్న చిరుద్యోగులు

బేస్తవారిపేట: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక, అన్ని ప్రభుత్వ శాఖల్లో ఉన్న నెలవారీ గౌరవ వేతనంతో పనిచేసే తాత్కాలిక ఉద్యోగులపై ప్రతాపం చూపుతూ వికృత రాజకీయ క్రీడను ప్రదర్శిస్తున్నారు. గతంలో ఎన్ని ప్రభుత్వాలు మారినా..ఫీల్డ్ అసిస్టెంట్‌లను, డ్వాక్రా వీఏఓలు, కుకింగ్ ఏజెన్సీలను తొలగించలేదు. ఎక్కడైనా అవకతవకలు జరిగినట్లు నిర్ధారణ అయిన వారిని మాత్రమే అధికారికంగా తొలగించారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మరుసటి రోజు నుంచే ఉపాధి హామీ పనులను నిలిపివేసి, చేసిన పనులకు అధికారులు కనీసం కూలి డబ్బులు కూడా చెల్లించకపోగా వారి చేత బలవంతంగా రాజీనామా చేయిస్తున్నారు. కూటమి నాయకులు అత్యుత్సాహం ప్రదర్శిస్తూ గ్రామంలో ఉనికిని కాపాడుకునేందుకు గౌరవ వేతనంతో పనిచేసే ఉద్యోగులను విధుల్లోంచి తొలగించేందుకు బరి తెగిస్తున్నారు. 2006లో మొదలైన ఉపాధిహామీ పథకంలో అప్పటి నుంచి అంటే దాదాపు 18 ఏళ్ల నుంచి క్షేత్ర సహాయకులుగా విధులు నిర్వహిస్తున్న వారిపై ప్రస్తుతం రాజకీయ రంగు అద్ది తొలగించే ప్రయత్నాలు చేస్తుండటంతో ఏం చేయాలో దిక్కుతోచని పరిస్థితుల్లో క్షేత్ర సహాయకులు ఉన్నారు. ఇన్నేళ్లుగా ఫీల్డ్ అసిస్టెంట్‌లుగా గ్రామంలో పని చేసుకుంటూ జీవనం సాగించిన వారితో ఉన్నఫళంగా బలవంతంగా రాజీనామాలు తీసుకుని, చేతికి మట్టి అంటకుండా హింసిస్తూ పొట్టకొడుతున్నారు. వారు వేరొక ఉద్యోగానికి వెళ్లేందుకు కూడా వయసు సరిపోని పరిస్థితి. వారంతా పార్టీలకతీతంగా జాబ్‌కార్డులు కలిగి పని కోరిన కూలీలకు ఉపాధిహామీ పనులు పెట్టించి పనులు చేయించడానికే పరిమితమయ్యారు. అయితే వారిపై కూడా టీడీపీ నాయకులు కక్షపూరితంగా వ్యవహరించి తొలగించాలని చూడడంపై సామాన్య కూలీలు సైతం తప్పుపడుతున్నారు.



ఈయన పేరు తోటకూరి ఏలివసంతకుమార్. బేస్తవారిపేట మండలంలోని పందిళ్లపల్లె ఎస్సీకాలనీకి చెందిన ఇతను 12 సంవత్సరాలుగా ఉపాధిహామీ పథకంలో ఫీల్డ్‌అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వైఎస్సార్ సీపీ కార్యకర్త అని అతనిని తొలగించేందుకు తీవ్ర స్థాయిలో ఒత్తిడి తెచ్చారు. ఒకవైపు నాయకులు, మరోవైపు అధికారులు చేసిన ఒత్తిడి తట్టుకోలేక ఫీల్డ్ అసిస్టెంట్ ఉద్యోగానికి రాజీనామా చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.



ఈమె పేరు దొంతిరెడ్డి తిరుపతమ్మ. కొనకనమిట్ల మండలం గొట్లగట్టుకు చెందిన ఆమె జెడ్పీ ఉన్నత పాఠశాలలో వంట మనిషిగా పని చేసింది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే మార్కాపురం నియోజకవర్గ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అండతో గ్రామ టీడీపీ నాయకులు ఒత్తిడి తెచ్చి వంట మనుషులను అకారణంగా తొలగించారు. ఈమెతోపాటు ఐదుగురిని తొలగించి వాళ్ల జీవనం మీద దెబ్బకొట్టారు.

ప్రస్తుతానికి వీరిపై వేటు

- ఫీల్డ్ అసిస్టెంట్‌లు 600 మంది
- రేషన్ డీలర్లు: 1000 మంది
- వీఓఏలు: 250 మంది
- మధ్యాహ్న భోజన ఏజెన్సీలు: 300

ఏకపక్షంగా వ్యవహరిస్తున్న అధికారులు

టీడీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కూటమి నాయకుల ఒత్తిడికి తలొగ్గిన అధికారులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారు. జిల్లాలో ఫీల్డ్ అసిస్టెంట్‌లు 729 మంది ఉండగా వారిలో సుమారు 600 మందిపై వేటు వేస్తున్నారు. రేషన్ డీలర్లు 1380 మంది ఉండగా వారిలో వెయ్యి మందిని బలవంతంగా తొలగిస్తున్నారు. వీఓఏలు 1467 మంది ఉండగా 250 మంది చేత బలవంతంగా రాజీనామా చేయిస్తున్నారు. మధ్యాహ్న భోజన ఏజెన్సీలు 2325 మంది ఉండగా 300 మందిని తొలగించేందుకు రంగం సిద్ధం చేసుకున్నారు. ఇప్పటికే వీరిలో చాలామంది చేత బలవంతంగా రాజీనామా చేయించారు. పెద్దారవీడు మండలంలో 59 మంది మధ్యాహ్న భోజన కార్మికులు ఉండగా ఇప్పటి వరకు 10 మందికి ఉద్వాసన పలికారు. మరింత మందిని తప్పించేందుకు రంగం సిద్ధమైంది. ఇదే మండలంలో 21 రేషన్ దుకాణాలు ఉండగా 20 మందిని తొలగించారు. 20 ఏళ్లుగా సేవలందిస్తున్న సుంకేసుల గ్రామ రేషన్ డీలర్‌ను తొలగించేందుకు టీడీపీ నాయకులు కుట్ర చేశారు. తహసీల్దార్‌ని గ్రామానికి పంపి విచారణ చేయించినా ఎవరూ వ్యతిరేకంగా చెప్పకపోవడంతో వెనుదిరిగారు. తర్లుపాడు మండలంలో 16 మంది ఫీల్డ్ అసిస్టెంట్‌లను అనధికారికంగా తొలగించారు. ఎటువంటి సమాచారం అందించకుండా కొత్తవారిని విధుల్లోకి తీసుకునేందుకు అధికారులు సిద్ధమయ్యారు. పామూరు మండలంలో ఫీల్డ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించిన సంబంధిత అధికారులు వారందరినీ రాజీనామా చేయాల్సిందిగా పరోక్షంగా ఆదేశించారు. దీంతో ఐదుగురు ఫీల్డ్ అసిస్టెంట్‌లు ఇప్పటికే రాజీనామా చేశారు. దర్శిలో అధికార పార్టీ నాయకులు రేషన్ డీలర్లను రాజీనామాలు చేయాలంటూ రేషన్ డీటీ అశోక్ ద్వారా వత్తిళ్లు తీసుకొస్తున్నారు. ప్రతి నెల 20 నుంచి 25 తేదీ నాటికి అన్నీ దుకాణాలకు రేషన్ సరఫరా జరుగుతుంది. అయితే ఈ నెల మాత్రం రేషన్ తోలకుండా డీలర్లను రాజీనామాలు చేయాలని ఒత్తిళ్లు తీసుకొస్తున్నారు. లొంగని వారిని కేసులు రాస్తామని బెదిరిస్తున్నారు. తాము న్యాయంగా రేషన్ ఇస్తుంటే ఎలా కేసులు రాస్తారని కొందరు డీలర్లు డీటీని ప్రశ్నించిన దాఖలాలు ఉన్నాయి. ఎక్కడ తప్పుడు కేసులు పెడతారోనని డీలర్లు సీసీ కెమెరాలు కూడా పెట్టుకోవడం గమనార్హం. దర్శి నియోజకవర్గంలో 26 రేషన్ దుకాణాలు ఉండగా టీడీపీ మద్దతు దారులైన 10 దుకాణాలకు మాత్రమే రేషన్ తోలారు. మిగిలిన 26 దుకాణాలకు ఇప్పటికీ రేషన్ నిల్వలు రాలేదు. దీంతో తమకు రేషన్ తోలుతారా లేదా అనే ఆందోళనలో డీలర్లు ఉన్నారు. ఇలా కూటమి నేతల దాష్టీకంతో వచ్చినపడిన ఈ ఉపద్రవానికి ఉన్న ఉద్యోగాలను కోల్పోయిన చిరుద్యోగులు కుటుంబాలు గడవక దిక్కుతోచని స్థితిలో ఉన్నారు.

రైతుల చూపు మిర్చి వైపు..



ఖరీఫ్ సాగుకు పొలాన్ని సిద్ధం చేస్తున్న ట్రాక్టర్



కళ్లాలో ఆరబోసిన మిర్చి

- పశ్చిమ ప్రకాశంలో మిర్చి సాగుచేసేందుకు రైతుల ఆసక్తి
- కిలో మిర్చి విత్తనాలు రూ.50 వేల నుంచి రూ.60 వేలకు విక్రయాలు
- ప్రైవేటు విత్తన కంపెనీలపై రైతుల ఆసక్తి

మార్కాపురం: మంచి దిగుబడులు రావడంతో పాటు, గత ఏడాది అధిక ధరలు పలకడంతో పశ్చిమ ప్రకాశంలో రైతులు మిర్చి సాగుచేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. మిర్చిలో అధిక దిగుబడులు ఇచ్చే కంపెనీ విత్తనాల కోసం రైతులు ఎదురు చూస్తున్నారు. కిలో మిర్చి విత్తనాలు రూ.50 నుంచి రూ.60 వేలకు కొనుగోలు చేసేందుకు సిద్ధమయ్యారు. ముఖ్యంగా రైతులు అధిక దిగుబడులు ఇచ్చే రకాలుగా భావిస్తున్న యూఎస్ 341, నంబర్ 5, 5831 తేజలో పలు రకాలు కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. గిద్దలూరు నుంచి పుల్లలచెరువు వరకు ఉన్న 13 మండలాల్లోని రైతులు మార్కాపురానికి వచ్చి ఎరువులు, పురుగు మందులు, విత్తనాల దుకాణాలకు వచ్చి మిర్చి విత్తనాలు, నార్లు కొనుగోలు చేస్తున్నారు. నార్లు ఎక్కువగా పెద్దారవీడు, త్రిపురాంతకం, యర్రగొండపాలెం, మార్కాపురం మండలాల్లోని పలు ప్రాంతాల్లోని నర్సరీల్లో పెంచుతున్నారు. అయితే, ఈ విత్తనాల ధర అధికంగా ఉండటంతో రైతులు ఆలోచిస్తున్నారు. తులం మిర్చి విత్తనాలు రూ.600 నుంచి రూ.700 వరకు రకం, కంపెనీని బట్టి విక్రయిస్తున్నారు. ఎకరాకు సుమారు 10 వేల నుంచి 12 వేల మొక్కలు అవసరమవుతాయి. అంటే ఎకరాకు సుమారు 8 ప్యాకెట్ల వరకూ విత్తనాలు అవసరం. ఐదెకరాలు సాగుచేయాలంటే 45 నుంచి 50 ప్యాకెట్ల మిర్చి విత్తనాలు కావాలి. అప్పుడు ప్యాకెట్‌కు రూ.700 ధర పెట్టినా 5 ఎకరాలు సాగుచేయాలంటే విత్తనాలకే సుమారు రూ.35 నుంచి రూ.40 వేల వరకూ వెచ్చించాల్సి వస్తుంది. ఎకరాకు 25 నుంచి 30 క్వింటాళ్ల వరకు పైన పేర్కొన్న రకాల పంట నుంచి దిగుబడులు రావటంతో ఈ ఏడాది ఈ విత్తనాలు సాగు చేయాలని నిర్ణయించుకున్నారు. ఇటీవల అడపాదడపా కురుస్తున్న వర్షాలతోపాటు బోర్లకింద మిర్చి సాగు చేపట్టేందుకు రైతులు ఉత్సాహంగా ఉన్నారు. ఈ ఏడాది మార్చి వరకు గుంటూరు మార్కెట్ యార్డులో మిర్చి అమ్మకాలు బాగా సాగాయి. క్వింటా మిర్చి రకాన్ని బట్టి రూ.12 నుంచి రూ.14 వేల వరకు ధర లభించింది. డివిజన్ మొత్తం మీద గత ఏడాది ఖరీఫ్, రబీ సీజన్లలో మార్కాపురం, యర్రగొండపాలెం, గిద్దలూరు సబ్‌డివిజన్ల పరిధిలోని 13 మండలాల్లో సుమారు 41,871 ఎకరాల్లో మిర్చి పంట సాగు చేశారు. ఈ ఏడాది మిర్చి సాగు ఎక్కువ కావచ్చని భావిస్తున్నారు. రైతుల డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని నర్సరీల నిర్వాహకులు నార్లు పోశారు. కిలో మిర్చి విత్తనాలను 10 ఎకరాలకు సాగు చేసుకోవచ్చు. నర్సరీల్లో ఒక్కొక్క మిర్చి మొక్కను 60 నుంచి 70 పైసలకు విక్రయిస్తున్నారు. ఎకరాకు సుమారు 10 వేల మొక్కలు అవసరమవుతాయని వ్యవసాయాధికారులు తెలిపారు. స్థానిక వ్యాపారులు గుంటూరు, విజయవాడ నుంచి మిర్చి విత్తనాలు తెప్పిస్తున్నారు. పొలాలను రైతులు అరకలు, ట్రాక్టర్ల ద్వారా చదును చేయిస్తూ పంటలు సాగు చేసేందుకు సిద్ధమవుతున్నారు. రబీ సీజన్ మొత్తం 1123 హెక్టార్లలో సాగు చేశారు. మొత్తం మీద మిర్చి సాగు చేపట్టేందుకు రైతులు ఇష్టపడుతున్నారు.

మండలం	ఖరీఫ్ సాగు (హెక్టార్లలో)
మార్కాపురం	2824
దోర్నాల	605
పెద్దారవీడు	1881
వై పాలెం	1265
త్రిపురాంతకం	2990
పుల్లలచెరువు	616
గిద్దలూరు	5600
రాచర్ల	5155
కొమరోలు	3951
బేస్తవారిపేట	8400
కంభం	4484
అర్ధవీడు	4100

పొగాకు అదనపు కొనుగోళ్లు ప్రారంభం

- 9 కేంద్రాల్లో కొనుగోళ్లు ప్రారంభం
- రెండు కేంద్రాల్లో పొగాకు చూర కొనుగోలు



పొదిలి పొగాకు బోర్డులో వేలానికి సిద్ధంగా ఉన్న చూర బేళ్లు

ఒంగోలు సెంట్రల్: ఒంగోలు రీజియన్ పరిధిలో ఎట్టకేలకు పొగాకు అదనపు కొనుగోళ్లు శుక్రవారం ప్రారంభమయ్యాయి. 9 కేంద్రాల్లో పొగాకు కొనుగోలు ప్రారంభం కాగా, టంగుటూరు, పొదిలిలో మాత్రం పొగాకు చూర కొనుగోలు చేస్తుండటంతో శుక్రవారం ప్రారంభం కాలేదు. శనివారం నుంచి ఆ రెండు కేంద్రాల్లో కూడా పొగాకు కొనుగోలు జరుగుతుందని ఆర్ఎం లక్ష్మణరావు తెలిపారు. రీజియన్ పరధిలోని 9 కేంద్రాల్లో పొగాకు ధర శుక్రవారం గరిష్టంగా కందుకూరు–2 కేంద్రంలో కేజీ రూ.369, పొగాకు చూర గరిష్టంగా టంగుటూరులో రూ.213 పలికిందని ఆర్ఎం లక్ష్మణరావు తెలిపారు. రీజియన్ పరిధిలోని 9 కేంద్రాల్లో 4788 బేళ్లు రాగా, 4221 బేళ్లు వ్యాపారులు కొనుగోలు చేశారు. 567 బేళ్లు వివిధ కారణాలతో తిరస్కరించారు. ఒంగోలు (పేర్నమిట్ట), వెల్లంపల్లి, ఒంగోలు, కొండపి కేంద్రాల్లో 115వ రోజు వేలం పాటలో 2187 బేళ్లు రాగా 1995 వ్యాపారులు కొనుగోలు చేశారు. 192 బేళ్లు వివిధ కారణాలతో తిరస్కరించారు. అందులో కేజీ గరిష్ట ధర రూ.361, కనిష్టంగా రూ.205, సరాసరి రూ.254.02 వచ్చింది. కందుకూరు–1, 2, కనిగిరి, డీసీపల్లి, కలిగిరి తదితర కేంద్రాల్లో 109వ రోజు వేలం పాటలో 1339 బేళ్లు రాగా, 1221 బేళ్లు కొనుగోలయ్యాయి. 118 బేళ్లు వివిధ కారణాలతో తిరస్కరించారు. అందులో గరిష్టంగా రూ.369, కనిష్ట ధర రూ.205, సరాసరి రూ.307.49 పలికింది.

పొగాకు చూర కొనుగోలు ఇలా..

పొదిలి, టంగుటూరులలో పొగాకు చూర సైతం కేజీ రూ.200 దాటింది. రెండు కేంద్రాల్లో చూర వేలం పాటలో 1262 బేళ్లు రాగా, 1005 బేళ్లు కొనుగోలయ్యాయని, 257 బేళ్లు వివిధ కారణాలతో తిరస్కరించారని తెలిపారు. పొదిలి కేంద్రంలో 109వ రోజు వేలం పాటలో 623 బేళ్లు రాగా, 484 బేళ్లు కొనుగోలయ్యాయి. 139 బేళ్లు వివిధ కారణాలతో తిరస్కరించారు. అందులో గరిష్టంగా రూ.146, కనిష్ట ధర రూ.60, సరాసరి రూ.67.94 పలికింది. టంగుటూరు వేలం కేంద్రంలో 115వ రోజు వేలం పాటలో 639 బేళ్లు రాగా, 521 బేళ్లు వ్యాపారులు కొనుగోలు చేశారు. 118 బేళ్లు వివిధ కారణాలతో తిరస్కరించారు. అందులో కేజీ గరిష్ట ధర రూ.213, కనిష్టంగా రూ.60, సరాసరి రూ.93.52 వచ్చిందని తెలిపారు.

ప్రశ్నించే గొంతులపై ఆ చట్టాలు ఉక్కు పాదాలు

- నూతన నేర చట్టాలపై అవగాహన సదస్సులో హైకోర్టు సీనియర్ న్యాయవాది రాజేంద్ర ప్రసాద్



సదస్సులో మాట్లాడుతున్న ఏపీ బార్ కౌన్సిల్ మెంబర్ సుంకర రాజేంద్ర ప్రసాద్

ఒంగోలు సెంట్రల్: కేంద్రంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన నేర చట్టాలు ప్రజా సమస్యలను ప్రశ్నించే గొంతుకలపై ఉక్కు పాదాలని హైకోర్టు సీనియర్ న్యాయవాది, ఏపీ బార్ కౌన్సిల్ మెంబర్ సుంకర రాజేంద్ర ప్రసాద్ అన్నారు. ఒంగోలులోని మల్లయ్య లింగం భవన్‌లో శుక్రవారం కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన నేర చట్టాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ వామపక్ష పార్టీలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఏపీ బార్ కౌన్సిల్ మెంబర్ సుంకర రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ దేశంలో వలస పాలకులు తీసుకొచ్చిన చట్టాలు కొనసాగకూడదని వాటి స్థానంలో నవభారతానికి నూతన చట్టాలు తీసుకువస్తున్నామని కేంద్ర ప్రభుత్వం తెచ్చిన నూతన నేర చట్టాలు గొప్పగా మార్పులు చేసిన దాఖలాలు లేవని అన్నారు. చట్టాలు మార్చినప్పుడు అవి ప్రజలకు మరింత స్వేచ్ఛను ఇచ్చేలా ఉండాలన్నారు. నూతన చట్టాల్లో అటువంటి అనవాళ్లు లేవన్నారు. బ్రిటీష్ ఇండియన్ పీనల్ కోడ్ ఐపీసీ–1860, ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్– 1872, క్రిమినల్ ప్రొసీజర్ కోర్ట్ సీఆర్పీసీ–1890లను రద్దు చేసి వాటి స్థానంలో సంహిత బిల్లు–2023, భారతీయ సాక్ష్యాల చట్టం– 2023, భారతీయ నాగరిక్ సురక్ష సహిత–2023 చట్టాలను తీసుకొచ్చారని చెప్పారు. దేశంలోని నేర చట్టాలను సంస్కరణ పేరుతో కేంద్ర గృహ మంత్రిత్వశాఖ 2020 మే 4న ఒక నోటిఫికేషన్ విడుదల చేసిందన్నారు. ప్రజల నుంచి మేధావుల నుంచి అభిప్రాయాలు సేకరిస్తామన్న పేరుతో న్యాయవాదుల నుంచి ఎటువంటి అభిప్రాయ సేకరణ జరగకుండా ఏక పక్షంగా జూలై ఒకటి నుంచి అమలులోకి తీసుకొచ్చారన్నారు. ఇప్పటికైనా నూతన నేర చట్టాలను ఉపసంహరించుకోవాలని వక్తలు డిమాండ్ చేశారు. సీపీఎం జిల్లా నాయకులు జీవీ కొండా రెడ్డి, సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి చిట్టిపాటి వెంకటేశ్వర్లు, జిల్లా కార్యదర్శి సాగర్, సీపీఐ ఎంఎల్ జిల్లా కార్యదర్శి డీవీఎన్ స్వామి, సంయుక్త కిసాన్ మోర్చ జిల్లా కన్వీనర్ చుండూరి రంగారావు, ఐలు జిల్లా కార్యదర్శి ఎంపీ యాసిన్, ప్రజాతంత్ర ఐక్యవేదిక నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములను కాపాడాలి



మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా కార్యదర్శి ఆంజనేయులు

ముండ్లమూరు: అన్యాక్రాంతమవుతున్న ప్రభుత్వ భూములను కాపాడి అర్హులైన నిరుపేదలకు పంపిణీ చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు డిమాండ్ చేశారు. మండలంలోని పూరిమెట్ల గ్రామంలో ఆక్రమణకు గురైన వాగు పోరంబోకు భూమిని స్థానిక ఎస్సీలతో కలిసి ఆయన పరిశీలించారు. కాలనీకి చెందిన కొందరు వాగు పోరంబోకు భూమిలో పది ఎకరాల వరకు తమ పూర్వీకుల కాలం నుంచి సాగు చేసుకుంటున్నట్లు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. మిగిలిన భూమి తమ పశువులు, మేకలు మేపుకొనేందుకు ఉపయోగించుకుంటున్నట్లు తెలిపారు. ఇటీవల కొందరు ఆ భూమిని ఆక్రమించి కంచె వేయగా జిల్లా అధికారులు స్పందించి కొంత భూమికి సంబంధించి కంచె తొలగించారని, ఇంకా ఆక్రమణలో ఉన్న భూమిని స్థానిక పేదలకు పంచాలని కోరారు. ఆక్రమిత భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకోకపోతే ఉద్యమిస్తామని కంకణాల ఆంజనేయులు హెచ్చరించారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి బి.రఘురాం, సీపీఎం మండల కార్యదర్శి వెల్లంపల్లి ఆంజనేయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

జిల్లా జడ్జిని కలిసిన ఎస్పీ



జిల్లా ప్రధాన న్యాయమూర్తి భారతికి మొక్క అందిస్తున్న ఎస్పీ దామోదర్

ఒంగోలు: జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఏ భారతిని శుక్రవారం ఎస్పీ ఏఆర్ దామోదర్ మర్యాదపూర్వకంగా కలిసి మొక్క అందించారు. న్యాయశాఖ, పోలీసుశాఖలు సమన్వయంతో పనిచేసి బాధితులకు సత్వర న్యాయం అందించడంపై వారిద్దరూ కొద్దిసేపు చర్చించారు. న్యాయ, పోలీసుశాఖల సంబంధ బాంధవ్యాలు మరింత మెరుగుపడేలా కృషిచేసి నేరం చేసిన వారికి త్వరితగతిన శిక్షపడేలా, బాధితులకు న్యాయం అందించేలా పోలీసుశాఖ తరఫున కృషిచేస్తామని జిల్లా ప్రధాన న్యాయమూర్తికి ఎస్పీ హామీ ఇచ్చారు.

రేపు అండర్-7 జిల్లాస్థాయి చెస్ పోటీలు

ఒంగోలు: అండర్-7 బాలబాలికల జిల్లాస్థాయి చెస్ పోటీలను స్థానిక సుజాతనగర్‌లోని ఐకాన్ పబ్లిక్ స్కూల్లో ఈ నెల 28వ తేదీ నిర్వహించనున్నట్లు ప్రకాశం జిల్లా చదరంగ సమాఖ్య కార్యదర్శి షేక్ అబ్దుల్ నబీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పూర్తి వివరాలకు సెల్ నంబర్ 9666725719ను సంప్రదించాలని సూచించారు.

బధిరుల పాఠశాలలో ప్రవేశాలకు ఆహ్వానం

ఒంగోలు: స్థానిక ప్రభుత్వ బధిరుల పాఠశాలలో 1 నుంచి 10వ తరగతి వరకు ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ తలపుల వెంకటేశ్వర్లు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినికిడి లోపం ఉన్నట్లు సదరం సర్టిఫికెట్, పాఠశాల బదిలీ సర్టిఫికెట్‌తో పాటు ఆధార్ కార్డు, బ్యాంకు అకౌంట్ పాస్‌పుస్తకం మొదటి పేజీ నకలు కాపీతో పాఠశాలలో సంప్రదించాలన్నారు. ఒకటి నుంచి 10వ తరగతి వరకు అడ్మిషన్లు జరుగుతున్నాయని, విద్యార్థులకు ప్రత్యేక హాస్టల్ కూడా ఉందని అన్నారు. రాష్ట్రంలోని ఏ జిల్లా వారైనా పాఠశాలలో చేరేందుకు అర్హులని పేర్కొన్నారు. ఉచిత విద్య, ఉచిత వసతి, ఉచిత భోజనంతో పాటు సుశిక్షితులైన ఉపాధ్యాయులచే విద్యాబోధన, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో చదువు నేర్పడం జరుగుతుందని, పూర్తి వివరాలకు ఫోన్ నంబర్ 9000872305ను సంప్రదించాలని కోరారు.

అద్భుతం.. అవంతిక నృత్యం

- దేశ విదేశాల్లో 200కు పైగా ప్రదర్శనలిచ్చిన నాట్యమయూరి
- చిన్న వయసులోనే లెక్కకు మిక్కిలిగా అవార్డులు, రివార్డులు

కూచిపూడి, భరతనాట్యం, జానపదం, కథకళి, కథక్, మణిపురి, ఒడిస్సీ, మోహినీ అట్టం, యక్షగానం ప్రముఖమైన నృత్యకళలు. వీటిలో భరత నాట్యానికి ఉన్న ప్రాముఖ్యత ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ప్రసిద్ధిగాంచిన పురాతన ఆలయాల్లో కనిపించే శిల్పాలు భరతనాట్య భంగిమలో దర్శనమిస్తాయి. తంజావూరులో పుట్టి ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన భరతనాట్యమంటే అందరికీ ఇష్టమే. భరతనాట్య కళాకారులకు గుర్తింపు, గౌరవం కూడా ఎక్కువే. అలాంటి గుర్తింపు, గౌరవాన్ని చిన్న వయసులోనే సొంతం చేసుకుంది మార్కాపురానికి చెందిన చిన్నారి అవంతిక.

మార్కాపురం:

కళలపై అభిరుచి ఉన్న తలిదండ్రులు తమ పిల్లలను ప్రముఖ కళాకారులుగా చూడాలని కోరుకుంటారు. మార్కాపురం పట్టణానికి చెందిన ప్రముఖ న్యాయవాది, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు భూపని కాశయ్య, అన్నపూర్ణాదేవి దంపతులు కూడా తమ కుమార్తె అవంతికను నాట్య కళాకారిణిగా చూడాలని భావించారు. ఐదేళ్ల వయసు నుంచే నాట్య గురువు ప్రతిమ దగ్గర శిక్షణ ఇప్పిస్తున్నారు. 2016లో ప్రారంభమైన నృత్య శిక్షణ ఇప్పటికీ కొనసాగుతోంది.

మార్కాపురం పట్టణంలోని ఒక ప్రైవేట్ పాఠశాలలో ప్రస్తుతం 5వ తరగతి చదువుతున్న ఆ చిన్నారి గడిచిన ఏడేళ్లలో సొంతూరితోపాటు ఒంగోలు, విజయవాడ, విశాఖపట్నం, రాజమండ్రి, తిరుపతి, శ్రీకాళహస్తి, శ్రీశైలం, హైదరాబాద్ తదితర ప్రాంతాల్లో నృత్య ప్రదర్శనలు ఇచ్చి శభాష్ అనిపించుకుంది. ముఖ్యంగా నరసింహ కౌతువం ప్రదర్శనలో అవంతిక నాట్యం అద్భుతమని చెప్పవచ్చు. ఇందులో హావభావాలు, ముఖ కవళికలను



తల్లిదండ్రులతో..

చూసి తీరాల్సిందే. 2022లో మలేషియా, 2023లో శ్రీలంక, ఈ ఏడాది ఏప్రిల్‌లో దుబాయ్‌లోనూ నృత్య ప్రదర్శనలిచ్చిన అవంతిక అంతర్జాతీయ స్థాయిలో బహుమతులు అందుకుంది. అంతే కాదండోయ్.. చదువులో కూడా అవంతిక క్లాస్ ఫస్టే. మరొక విశేషమేమిటంటే అవంతిక సంగీతంలోనూ శిక్షణ తీసుకుంటోంది.



గెలుపొందిన అవార్డులతో..



నాట్యం చేస్తున్న అవంతిక

గెలుపొందిన అవార్డులు

- 2020లో నిర్వహించిన జాతీయ నృత్య ఉత్సవాల్లో పాల్గొని నంది పురస్కారం అందుకుంది.
- 2021లో హంపిలో నిర్వహించిన జాతీయ స్థాయి నృత్య ప్రదర్శనలో అంజనా పురస్కారం, ధూర్జటి పురస్కారం, నాట్యమయూరి పురస్కారం పొందింది.
- 2022లో జాతీయ స్థాయిలో సూపర్ చాంపియన్‌గా ఎంపికైంది. డివిజన్ స్థాయి ఐకాన్ అవార్డు పొందింది. అలాగే బాల నాట్య నర్తకీమణి, నర్తన నంది, గజకేశరి పురస్కారాలు పొందింది.
- కాళహస్తిలో నిర్వహించిన నృత్య పోటీలో ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకుంది.
- రాజమండ్రిలో నిర్వహించిన పోటీల్లో రెండో స్థానం, శ్రీశైలంలో నిర్వహించిన జాతీయ స్థాయిలో మూడో స్థానంలో నిలిచింది.
- 2023లో అంతర్జాతీయ స్థాయిలో సూపర్ చాంపియన్‌గా ఎంపికైంది.

నాట్యం, సంగీతం చాలా ఇష్టం

మా అమ్మాయి అవంతికకు నాట్యమంటే ఇష్టమని గమనించి నాట్య గురువు ప్రతిమ వద్ద 2016లో శిక్షణలో చేర్పించాం. అప్పటి నుంచి వెనుదిరిగి చూడలేదు. రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లోనూ ప్రేక్షకులను మెప్పించి బహుమతులు సాధించింది. ఈ మధ్య సంగీతం కూడా నేర్చుకుంటోంది. ఈ రెండిటినీ బ్యాలెన్స్ చేస్తూ చదువులో కూడా ఫస్ట్ వస్తోంది. తల్లిదండ్రులు తమ పిల్లలకు ఇష్టమైన కళల్లో శిక్షణ ఇప్పించి ప్రోత్సహిస్తే సంస్కృతీ సంప్రదాయాలను కొనసాగించినవారవుతారు. మానసిక ఆనందంతోపాటు గౌరవం కూడా లభిస్తుంది.

– భూపని కాశయ్య, అన్నపూర్ణాదేవి

కేన్సర్ రోగికి రెడ్‌క్రాస్ సాయం



కేన్సర్ రోగికి నగదు అందిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు అర్బన్: కేన్సర్ వ్యాధితో బాధపడుతున్న వ్యక్తి వైద్య ఖర్చుల కోసం రెడ్‌క్రాస్ ద్వారా కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆర్థిక సహాయం అందించారు. శుక్రవారం ప్రకాశం భవనంలో బాధితుడి కుటుంబ సభ్యులకు నగదు అందజేశారు. ఒంగోలు మండలం గుడమాలకు చెందిన సింగోతు కోటేశ్వరరావు గత రెండేళ్లుగా కేన్సర్‌తో బాధపడుతున్నాడు. ప్రస్తుతం కేన్సర్ నాలుగో దశకు చేరింది. గుంటూరులో రేడియేషన్ చికిత్స చేసినా ఫలితం లేకపోవడంతో హైదరాబాద్‌లోని పునర్జన్ ఆయుర్వేద ఆస్పత్రిలో గత రెండు నెలలుగా చికిత్స పొందుతున్నాడు. అయితే నెలకు రూ.20 వేలు అవసరం కావడంతో కూలీ పనులు చేసుకునే తమకు సహాయం చేయాలని బాధితుడి భార్య కలెక్టర్‌కు విజ్ఞప్తి చేసింది. దీనిపై స్పందించిన కలెక్టర్ కేన్సర్ రోగికి సహాయం చేయాలని రెడ్‌క్రాస్ చైర్మన్ ప్రకాష్‌కు సూచించారు. ఈ మేరకు రూ. 20 వేల చెక్కును కలెక్టర్ చేతులమీదుగా బాధితుడి కుటుంబ సభ్యులకు అందజేశారు. వెంటనే స్పందించి సహాయం అందించిన రెడ్‌క్రాస్ ప్రకాష్‌ను కలెక్టర్ అభినందించారు. రెడ్‌క్రాస్ సభ్యులు సుధాకర్ రావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రెండు లారీలు ఢీ, ఇద్దరికి గాయాలు



బోల్తాపడిన సిమెంట్ మిక్సర్ ట్యాంకర్



దెబ్బతిన్న సిమెంటు లారీ



వైద్యశాలలో చికిత్స పొందుతున్న లారీ డ్రైవర్ ఏసు

బేస్తవారిపేట: రెండు లారీలు ఢీకొని ఇద్దరికి గాయాలైన సంఘటన బేస్తవారిపేట మండలంలోని పూసలపాడు సమీపంలో ఒంగోలు-నంద్యాల హైవేపై శుక్రవారం జరిగింది. నంద్యాల నుంచి విజయవాడకు సిమెంట్ మిక్సర్ ట్యాంకర్ వెళ్తుండగా, మాచర్ల నుంచి తాడిపత్రికి సిమెంట్ బస్తాల లోడుతో వెళ్తున్న టర్బో లారీ రాంగ్‌రూట్‌లో వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సిమెంట్ మిక్సర్ వాహనం బోల్తాపడింది. సిమెంటు లోడు లారీ ముందు భాగం నుజ్జునుజ్జయింది. సంఘటన స్థలానికి చేరుకున్న ఎస్సై నరసింహారావు రోడ్డుపై అడ్డంగా నిలిచిపోయిన వాహనాలను పక్కకు తీయించారు. సిమెంటు లోడు వాహనం డ్రైవర్ ఏసు, సిమెంట్ మిక్సర్ వాహనం డ్రైవర్ శివనాయక్‌కు స్వల్ప గాయాలవగా, ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పూల దుకాణంలో చోరీ

- రూ.1.50 లక్షల నగదు అపహరణ



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్సై అబ్దుల్ రెహమాన్

మార్కాపురం: పట్టణంలోని పోలీసుస్టేషన్ ఎదురుగా ఉన్న హోల్‌సేల్ పూల దుకాణంలో రూ.1.50 లక్షలు చోరీ అయిన సంఘటన గురువారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం .. పట్టణానికి చెందిన ఖాజాహుస్సేన్ తన పూల దుకాణానికి గురువారం రాత్రి యథావిధిగా తాళం వేసుకుని ఇంటికి వెళ్లాడు. శుక్రవారం ఉదయం 8 గంటల సమయంలో షాపు తెరిచేందుకు వెళ్లగా షట్టర్ తాళాలు పగలగొట్టి ఉండటాన్ని గమనించారు. షట్టర్ తెరిచి చూడగా బీరువా తాళాలు పగులగొట్టి ఉన్నాయి. అందులో ఉన్న రూ.1.50 లక్షల నగదు చోరీ అయినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంఘటనా స్థలాన్ని సీఐ ఆవుల వెంకటేశ్వర్లు, పట్టణ ఎస్సై అబ్దుల్ రెహమాన్ పరిశీలించారు. క్లూస్ టీమ్ బృందంతో ఆధారాలు సేకరించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

పెండింగ్ కేసులు పరిష్కరించాలి

- ఎస్పీ దామోదర్
- జిల్లాలోని పలు పోలీస్‌స్టేషన్ల తనిఖీ



కొండపి పోలీస్‌స్టేషన్‌లో రికార్డులు తనిఖీ చేస్తున్న ఎస్పీ దామోదర్

పొదిలి: పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని ఎస్పీ దామోదర్ పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లాలోని పలు పోలీస్‌స్టేషన్లను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. పొదిలి పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేసి పలు విభాగాలను పరిశీలించారు. రికార్డులు తనిఖీ చేశారు. సర్కిల్ కార్యాలయం, పెట్రోల్ బంకును పరిశీలించారు. లాకప్ గదులు, రిసెప్షన్, కంప్యూటర్ రూం, క్రైమ్ రికార్డుల నిర్వహణను పరిశీలించారు. పోలీసు అధికారులు, సిబ్బందికి పలు సలహాలు, సూచనలు చేశారు. పోలీసు సిబ్బంది పిల్లలతో కొంతసేపు సరదాగా గడిపారు. జిల్లా నడికూడలి అయిన పొదిలిలో ట్రాఫిక్ సమస్య పరిష్కారం కోసం పోలీసులు ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎస్పీ దామోదర్ సూచించారు. స్టేషన్ పరిధిలో నేరాల నియంత్రణకు గట్టి చర్యలు చేపట్టాలన్నారు. వృత్తి నైపుణ్యతకు సాంకేతికను జోడించి మెరుగైన పోలీసింగ్ చేయాలన్నారు. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ పోలీస్ శాఖపై మరింత నమ్మకం కలిగించాలన్నారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు, ప్రమాదాల నియంత్రణకు గట్టి చర్యలు చేపట్టాలన్నారు. పోలీసుల సమస్యలు, ఇబ్బందులపై ఆరా తీశారు. ఇటీవల నమోదైన కేసుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఆయా కేసుల్లో సీజ్ చేసిన ప్రాపర్టీని ఉన్నతాధికారుల అనుమతితో వెంటనే యజమానులకు అప్పగించాలన్నారు. ఎక్కువగా జరిగే నేరాలు ఏమిటి, వాటి విచారణలో పురోగతిపై ప్రశ్నించారు. ట్రాఫిక్ నియంత్రణ, దొంగతనాల కట్టడి, మిస్సింగ్ కేసుల ఛేదింపు, అక్రమ ఇసుక తరలింపు, చిన్న పిల్లలపై నేరాలు, అసాంఘిక కార్యకలాపాల కట్టడికి కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గస్తీ ముమ్మరం చేయాలని సూచించారు. విజిబుల్ పోలిసింగ్‌కు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఫిర్యాదుదారులతో స్నేహపూర్వకంగా మెలిగి జవాబుదారీగా ఉండాలన్నారు. సీఐ మల్లికార్జునరావు, ఎస్సైలు జి.కోటయ్య, శివబసవరాజు తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు...

కొండపి (సింగరాయకొండ): విధి నిర్వహణలో సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే శాఖాపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ ఏఆర్ దామోదర్ హెచ్చరించారు. శుక్రవారం కొండపి పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అసాంఘిక, చట్టవ్యతిరేక కార్యకలాపాల కట్టడికి కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. గంజాయి వంటి నిషేధిత మాదక ద్రవ్యాల రవాణా, విక్రయించే వారిపై ఉక్కుపాదం మోపాలన్నారు. పోలీస్‌స్టేషన్‌లో పని చేస్తున్న సిబ్బంది వివరాలు, వారి విధుల గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఒక్కరూ విధుల్లో యూనిఫాం ధరించాని, రాత్రివేళల్లో పోలీస్ పెట్రోలింగ్ ముమ్మరం చేయాలని, గస్తీ విధులు పటిష్టంగా నిర్వర్తించి నేరాల నియంత్రణకు పటిష్ట చర్యలు చేపట్టాలని సూచించారు. అనంతరం స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించారు. ముందుగా స్టేషన్ పరిసరాలు, వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలను ఎస్పీ పరిశీలించారు. ఎస్పీ వెంట కొండపి సీఐ పాండురంగారావు, ఎస్సై కృష్ణబాజిబాబు, ఏఎస్సై, స్టేషన్ సిబ్బంది ఉన్నారు.

విజుబుల్ పోలీసింగ్ నిర్వహించాలి...

మద్దిపాడు: శాంతి భద్రతల పరిరక్షణకు విజుబుల్ పోలీసింగ్ నిర్వహించాలని ఎస్పీ దామోదర్ సూచించారు. మద్దిపాడు పోలీస్‌స్టేషన్‌ను శుక్రవారం ఆకస్మికంగా ఆయన తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించిన అనంతరం పెండింగ్ కేసులపై ఆరా తీశారు. వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పేకాట, మద్యం బెల్ట్‌దుకాణాలు, కోడిపందేలు తదితర అసాంఘిక కార్యకలాపాలపై గ్రామాల్లో ఎప్పటికప్పుడు నిఘా ఉంచాలన్నారు. ఆయన వెంట ఎస్సై శివబసవరాజు, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

30న ఒంగోలులో ప్రత్యేక జాబ్ మేళా

ఒంగోలు సెంట్రల్: జిల్లా ఉపాధి కార్యాలయం, కెల్ గ్రూప్ ఆధ్వర్యంలో ఈనెల 30న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి టి.భరద్వాజ తెలిపారు. అమెజాన్ రిటైల్ రంగంలో ఉద్యోగ అవకాశాలకు సంబంధించి కంపెనీలో ప్యాకింగ్, పికింగ్, స్కానింగ్, లోడింగ్, అన్‌లోడింగ్ సెక్టార్లలో వివిధ రకాల ఖాళీలను భర్తీ చేసేందుకు జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఐటీఐ, డిప్లొమా, టెన్త్, ఇంటర్మీడియెట్, ఏదైనా డిగ్రీ పూర్తి చేసిన వారికి ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 18 నుండి 35 ఏళ్లలోపు నిరుద్యోగ యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆధార్‌కార్డు, సర్టిఫికెట్స్ జిరాక్స్ కాపీలతో హాజరు కావాలని తెలిపారు. మరిన్ని వివరాలను http://forms.gle/wnfddgAQGrLSRwgq9 లేదా ఆఫీస్ సమయంలో 08592281776ను సంప్రదించాలని సూచించారు.

నైపుణ్యాలు వెలికితీసేందుకే శిక్షా సప్తాహ్



విద్యార్థులు తయారు చేసిన ప్రదర్శనలను పరిశీలిస్తున్న డీఈవో సుభద్ర

- డీఈవో సుభద్ర
- ఈతముక్కల హైస్కూల్ ఆకస్మిక తనిఖీ

ఈతముక్కల (కొత్తపట్నం): విద్యార్థుల్లోని నైపుణ్యాలు వెలికితీసేందుకే శిక్షా సప్తాహ్ కార్యక్రమాలను ప్రభుత్వం ప్రవేశపెట్టిందని డీఈవో సుభద్ర తెలిపారు. కొత్తపట్నం మండలంలోని ఈతముక్కల గ్రామంలో ప్రభుత్వ పాఠశాలను శుక్రవారం ఆకస్మికంగా ఆమె తనిఖీ చేశారు. శిక్షా సప్తాహ్ కార్యక్రమాలలో భాగంగా నిర్వహిస్తున్న సాంకేతిక నైపుణ్యాల దినోత్సవంలో విద్యార్థులు తయారు చేసిన ప్రదర్శనలను పరిశీలించారు. ఈ సందర్భంగా సుభద్ర మాట్లాడుతూ శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో విద్యార్థులు కొత్తగా ఆలోచించి ప్రదర్శనలు తయారు చేయడం అభినందనీయమన్నారు. ముందుగా యూడైస్‌కు సంబంధించి పాఠశాలలో చదివే విద్యార్థుల సంఖ్య, ఎండీఎం రిజిష్టర్లు పరిశీలించారు. డ్రింకింగ్ వాటర్ ప్లాంట్ పని చేస్తుందా.. లేదా..? అని అడిగి తెలుసుకున్నారు. నాడు-నేడు పనులు ఎంతవరకు వచ్చాయని పరిశీలించారు. అనంతరం విద్యార్థులకు కావాల్సిన వాటిపై ఉపాధ్యాయులు, సిబ్బందితో చర్చించి సలహాలు, సూచనలు చేశారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరుపై ఆరా తీశారు. శానిటేషన్ పనుల గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంఈవో-1 తులసీకుమారి, ఎంఈవో-2 పద్మావతి, హెచ్‌ఎం చెంచుపున్నయ్య, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఇసుకపై చార్జీలు వసూలు చేయద్దు



గనుల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ నిర్వహించిన వీడియో సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు అర్బన్: ఇసుక పాయింట్ల నిర్వహణ ఖర్చులు తప్ప ప్రజల నుంచి ప్రత్యేకంగా ఇసుక చార్జీలు వసూలు చేయద్దని ఆ విషయాన్ని విస్తృతంగా ప్రజలకు తెలియచేయాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా అధికారులను ఆదేశించారు. శుక్రవారం అమరావతి నుంచి గనులు, భూగర్భ వనరుల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ముఖేష్‌కుమార్ మీనా, డైరెక్టర్ ప్రవీణ్‌కుమార్ జిల్లా కలెక్టర్‌లతో వీడియో సమావేశం నిర్వహించారు. జిల్లాల్లో ఇసుక లభ్యత, నిల్వలు, రవాణా చార్జీలు, ఫిర్యాదులు వంటి అంశాలపై చర్చించారు. ప్రకాశం భవనం నుంచి కలెక్టర్, ఇతర అధికారులు పాల్గొన్నారు. అనంతరం జిల్లాలోని పరిస్థితిపై సంబంధిత అధికారులతో చర్చించారు. నూతన ఇసుక విధానంలో భాగంగా స్టాక్ పాయింట్ల నిర్వహణకు తప్ప ఎటువంటి రుసుము వసూలు చేయకూడదన్నారు. స్టాక్ పాయింట్ నుంచి ఒకే ప్రదేశానికి సరఫరాలో రవాణా చార్జీల పరంగా వ్యత్యాసం లేకుండా ట్రాన్స్‌పోర్టర్లతో సమావేశం నిర్వహిస్తామన్నారు. ప్రస్తుతం జిల్లాలో 26 వేల టన్నుల ఇసుక అందుబాటులో ఉన్నట్లు అధికారులు కలెక్టర్‌కు తెలిపారు. సమావేశంలో ఇరిగేషన్ ఎస్‌ఈ మురళీమోహన్, డీటీసీ సుశీల, ఆర్‌డీఓ సుబ్బారెడ్డి, గనుల శాఖ అధికారి రాజేంద్రప్రసాద్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి

ఒంగోలు సెంట్రల్: నగర శివారులో అనుమానాస్పద స్థితిలో గురువారం రాత్రి ఓ వ్యక్తి మృతదేహం లభ్యమైంది. ఆలస్యంగా వెలుగు చూసిన ఈ ఘటనలో కుళ్లిన స్థితిలో ఉన్న మృతదేహం పలు సందేహాలను రేకెత్తిస్తోంది. సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ ఎదురుగా ఉన్న ఒక విల్లా వద్ద మట్టి దిబ్బల్లో మృతదేహం పడి ఉండటంతో ఇది ఆత్మహత్యా లేక హత్యా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మృతుడి వయస్సు 50 ఏళ్లకు పైగా ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు. మృతదేహం వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఒంగోలు జీజీహెచ్‌కు తరలించారు. తాలూకా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సీనియర్ సాఫ్ట్‌బాల్ జిల్లా జట్లు ఇవే





సాఫ్ట్‌బాల్ జిల్లా జట్లతో టూటౌన్ సీఐ జగదీష్

ఒంగోలు: సీనియర్ సాఫ్ట్‌బాల్ జిల్లా జట్ల ఎంపిక పోటీలను స్థానిక ఏబీఎం డిగ్రీ కాలేజీ ఆవరణలో శుక్రవారం నిర్వహించారు. సెలెక్షన్ కోచ్ త్రినాథ్ బాబు, ఒలంపిక్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు పీఎల్ రాజు, ఏబీఎం కాలేజీ ప్రిన్సిపాల్ డి.శివాని పర్యవేక్షణలో జట్లను ఎంపిక చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన ఒంగోలు టూటౌన్ సీఐ జగదీష్ మాట్లాడుతూ.. క్రీడలు మానసిక ఉల్లాసానికి, శారీరక దృఢత్వానికి దోహదపడతాయన్నారు. క్రీడల్లో రాణిస్తే స్కూల్, కాలేజీ అడ్మిషన్లు, ప్రభుత్వ ఉద్యోగాల్లో మంచి అవకాశాలు వస్తాయన్నారు. సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి బొడ్డు సుబ్బారావు మాట్లాడుతూ.. సాఫ్ట్‌బాల్ క్రీడలో రాణించిన అనేక మంది మంచి మంచి ఉద్యోగాలు పొందారని పేర్కొన్నారు.

బాలుర జట్టు : టి.త్రినాథ్, కె.ప్రేమ్‌కుమార్, సీహెచ్ కళ్యాణ్, టి.గోపికృష్ణ, కె.కోటేశ్వరరావు, బి.సుధీర్, పి.అఖిల్, టి.నాగార్జున, పి.మణికంఠ, ఎ.అశోక్, టి.దాసు, పి.సుబ్బారావు, కె.సుధీర్ సంజయ్, పి.చరణ్, కె.అన్వేష్, పి.వాసుదేవరాజ్ చోటు సంపాదించగా కోచ్‌గా బి.రాంబాబు, మేనేజర్‌గా బి.సుబ్బారావు వ్యవహరిస్తున్నారు.

బాలికల జట్టు : ఐ.నాగవేణి, పి.నందిని, పి.ఇందు నాగజ్యోత్స్న, బి.వాసంతి, ఓ.హరితేజ, బి.సమన్విత, పి.సుధారాణి, జి.కీర్తన, బి.స్వాతి, కె.స్ఫూర్తి సుజన్, యు.సింధూజ, ఓ.శిల్ప, ఎ.హర్షిత ఎంపిక కాగా, కోచ్‌గా కౌసల్య, మేనేజర్‌గా ఎం.సృజన వ్యవహరిస్తున్నారు.

క్లుప్తంగా

పశువ్యాధులపై దృష్టి సారించాలి


పశుపోషకులకు శిక్షణ ఇస్తున్న లీలాకృష్ణ

దర్శి: పశువుల వ్యాధులపై దృష్టి సారించి నాణ్యమైన పాల సేకరణ చేయాలని పశు వైద్య శాస్త్రవేత్త డాక్టర్ లీలా కృష్ణ సూచించారు. స్థానిక కృషి విజ్ఞాన కేంద్రంలో పశువుల వ్యాధుల నివారణ చర్యలపై రైతులు, పశుపోషకులకు శుక్రవారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా లీలాకృష్ణ మాట్లాడుతూ అధిక పాల దిగుబడికి తీసుకోవాల్సిన యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు. పాడి పశువుల్లో జాగ్రత్తలు పాటిస్తే వ్యాధులు సోకకుండా ఉండటమే కాకుండా మంచి పాల దిగుబడి కూడా పొందే అవకాశాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ ఎస్.శివ, బీఏఐఎఫ్ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

పాఠశాలలో రికార్డుల పరిశీలన


ఆర్ఓ ప్లాంట్‌ను పరిశీలిస్తున్న ఎంఈఓ-2 సుబ్రహ్మణ్యం

పెద్దారవీడు: మండల కేంద్రం పెద్దారవీడులో మండల పరిషత్ ప్రాథమిక (జనరల్) పాఠశాలలో రికార్డులు, ఆర్ఓ ప్లాంట్‌ను ఎంఈఓ-2 ఎస్‌వీసీహెచ్ సుబ్రహ్మణ్యం శుక్రవారం పరిశీలించారు. విద్యార్థుల సామార్థ్యాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. చిన్నారులకు విద్య అర్థమయ్యే విధంగా బోధించాలని ఉపాధ్యాయులకు సూచించారు. మధ్యాహ్నం మెనూ ప్రకారం రుచికరంగా నాణ్యమైన భోజనం, శుద్ధ తాగునీటిని అందించాలని తెలిపారు. ఉపాధ్యాయులు పనితీరును అభినందించారు.

డిగ్రీ కళాశాలకు బీరువా అందజేత

దర్శి: పట్టణంలోని డిగ్రీ కళాశాలకు వైఎస్సార్ సీపీ వార్డు కౌన్సిలర్ మేడం మోహన్‌రెడ్డి రూ.15 వేల విలువైన బీరువాను ప్రదానం చేశారు. డిగ్రీ కళాశాలలో బీరువా అవసరం అని సంఘసేవకుడు జీవీ రత్నం దృష్టికి కళాశాల ప్రిన్సిపాల్ తీసుకురాగా దాతృత్వం గల వ్యక్తి అని మోహన్‌రెడ్డికి ఈ విషయం తెలియజేశారు. ఆయన అడిగిన వెంటనే బీరువా బహూకరించారు. బీరువా బహూకరించినందుకు కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు.

పెద్దదోర్నాలకు రాయితీ కందులు పది క్వింటాళ్లు

పెద్దదోర్నాల: పెద్దదోర్నాలకు పది క్వింటాళ్ల రాయితీ కందులు మంజూరైనట్లు వ్యవసాయాధికారి జవహర్‌లాల్‌నాయక్ తెలిపారు. మండల పరిధిలోని చిన్నదోర్నాలలో ఆయన రాయితీ కంది విత్తనాలను శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంది విత్తనాలు అవసరమైన రైతులు పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్ కార్డు నకలు, ఫోన్ నంబర్ తీసుకుని కంది విత్తనాలు పొందాలని సూచించారు. కంది విత్తనాల పూర్తి ఖరీదు కిలో 139 రూపాలయల 80 పైసలని, అవి 30 శాతం రాయితీతో 97 రూపాయల 85 పైసలకు దొరుకుతుందన్నారు. గ్రామ వ్యవసాయ సహాయకులు రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

ఫిజియోథెరపీని వినియోగించుకోవాలి

పుల్లలచెరువు: ప్రభుత్వ పాఠశాలల్లోని దివ్యాంగ విద్యార్థుల కోసం నిర్వహిస్తున్న ఫిజియోథెరపీని దివ్యాంగ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవో శామ్యూల్‌జాన్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎమ్మార్సీలో జరిగిన ఫిజియోథెరపీని ఎంఈవో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులను ఉద్దేశించి ఎంఈవో మాట్లాడుతూ ప్రతి విద్యార్థి తప్పనిసరిగా వారంలో ఒక్క రోజు జరిగే కార్యక్రమానికి హాజరు కావాలన్నారు. దీన్ని బాధ్యతగా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు తీసుకోవాలన్నారు. దివ్యాంగ విద్యార్థులకు ఫిజియోథెరపీతో అనేక ఉపయోగాలు ఉన్నాయని, వాటిని గమనించి ప్రతి ఒక్కరూ ఈ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రభుత్వం కూడా కొన్ని రాయితీలు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. డాక్టర్ అంకారావు, హెచ్ఎం ప్రియాంక, ఐఈఆర్టీ తేజరూపిని, విద్యార్థులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలను సందర్శించిన ఏఎస్‌డబ్ల్యూఓ

పెద్దదోర్నాల: మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలను అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ అధికారి అరుణకుమారి శుక్రవారం సందర్శించారు. డిగ్రీ కళాశాలకు సంబంధించి విద్యార్థులకు హాస్టల్ వసతి కల్పించాలని ప్రిన్సిపాల్ సావిత్రి కలెక్టర్‌ను కోరారు. ఈ నేపథ్యంలో కలెక్టర్ ఆదేశాల మేరకు అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ అధికారి అరుణకుమారి కళాశాలను సందర్శించారు. కళాశాలలో సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం తరగతి గదులను పరిశీలించారు. ప్రిన్సిపాల్ సావిత్రి పాల్గొన్నారు.

అక్కడంతా ప్రైవేట్ వ్యక్తుల వైద్యమే

- పశువైద్యశాలలో పశుపోషకుల ఇక్కట్లు
- ఇద్దరు డాక్టర్లున్నా ఉపయోగం సున్నా
- పట్టించుకోని జిల్లా అధికారులు


గేదెకు టానిక్ తాగిస్తున్న ప్రైవేట్ వ్యక్తి

కురిచేడు: స్థానిక పశువైద్యశాలల్లో ప్రైవేట్ వ్యక్తుల వైద్యమే పశుపోషకులకు దిక్కైంది. మండలంలోని పశువులకు ఒకే ఒక్క పశువైద్యశాల ఉంది. దానిలో ఒక సహాయ డైరెక్టర్, ఒక పశువైద్యుడు ఉంటారు. కానీ వారి ఇష్టం వచ్చినప్పుడు వచ్చి వెళ్తుంటారు. మండలంలోని 15 గ్రామ పంచాయతీల పరిధిలోని 32 గ్రామాల పశువులకు సరైన వైద్య అందడం లేదు. సచివాలయాల్లో ఉన్న ఆహాలు పశువులు పొలాలకు వెళ్లాక విధులకు వస్తారు. అవి ఇంటికి వచ్చే సమయానికి తిరిగి వీరు కూడా ఇళ్లకు వెళ్లిపోతారు. మండలంలోని అన్ని గ్రామాల్లో కలిపి పశువులు 1300, గొర్రెలు, మేకలు 35,000, కోళ్లు 11,000 ఉన్నాయి. మండల కేంద్రంలోని వైద్యశాలలో వైద్యులు, సిబ్బంది సరిగా అందుబాటులో లేకపోవడంతో ప్రైవేటు వ్యక్తులు వైద్యం చేసి పశుపోషకులను సంతృప్తి పరుస్తున్నారు. గతంలో గోపాలమిత్రలు అందుబాటులో ఉండే వారు. వారికి అధికారికంగా ఎటువంటి నియామకం లేకున్నా వారు చేసే కృత్రిమ గర్భధారణను నిర్ధారించాల్సింది వైద్యులే కనుక వారు చెప్పిన పనిచేస్తూ ఉంటారు. ప్రభుత్వ పథకాల సమాచారం కూడా పశుపోషకులకు తెలియదంటే అతిశయోక్తి కాదు. సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించిన దాఖలాలు కూడా లేవు. సీజనల్ వ్యాధులకు సంబంధించి టీకాలు కూడా ఆ నలుగురే గ్రామాలకు వెళ్లి వేసి టార్గెట్లు పూర్తి చేస్తుంటారు.

గోపాలమిత్రను అటెండర్‌గా నియమించవచ్చు:

గోపాలమిత్రలను అటెండర్‌గా నియమించమని గతంలో ప్రభుత్వం జీఓ ఇచ్చింది. ఆ ప్రకారం ప్రసాద్‌ను అటెండరుగా నియమించాం. అటెండర్లు చిన్న చిన్న వైద్యం కూడా చేయవచ్చు. పెద్ద పెద్ద వ్యాధులకు మాత్రమే చికిత్స చేయకూడదు. నేను మీటింగ్‌కు వెళ్లాను. పశుపోషకులు ఇబ్బంది పడకూడదని చికిత్స చేసి ఉంటాడు. అందులో తప్పులేదు.

డాక్టర్ రమేష్, పశువైద్యాధికారి

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు

- డీఎల్‌పీఓ పద్మజ


పారిశుధ్య పనులు పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ పద్మజ

తాళ్లూరు (ముండ్లమూరు): గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పారిశుధ్య చర్యలు చేపట్టాలని ఒంగోలు డీఎల్‌పీఓ పద్మజ అన్నారు. మండలంలోని బొద్దికూరపాడు పంచాయతీలో శుక్రవారం వాటర్ ట్యాగ్నెట్ (శానిటేషన్) మరియు కాలువ పూడికతీత పనులను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అపరిశుభ్రతతో ప్రజలు రోగాల బారిన పడే అవకాశం ఉందన్నారు. సాధారణంగా వర్షాలు పడే సమయంలో డెంగీ, మలేరియా, డయేరియా, టైఫాయిడ్ వంటి రోగాలు ప్రబలే ప్రమాదముందన్నారు. ముందస్తు చర్యల్లో భాగంగా ప్రతి పంచాయతీలో శానిటేషన్ పనులు, పూడికతీత పనులు యుద్ధప్రాతిపదికన చేపట్టాలని తెలిపారు. సైడు కాల్వల్లో పేరుకు పోయిన చెత్తాచెదారాన్ని తొలగించాలన్నారు. ప్రధాన వీధుల్లో రోడ్ల వెంబడి మురుగు నీరు నిల్వ లేకుండా తగు చర్యలు తీసుకోవాలని ఈఓఆర్డీని ఆదేశించారు. మురుగు నీరు నిల్వ ఉన్న చోట ఆరోగ్య సిబ్బందితో సమన్వయం చేసుకొని యాంటీ లార్వా స్ప్రేయింగ్ చేపించాలన్నారు. పంచాయతీ, ఆరోగ్య సిబ్బంది సమన్వయంతో పని చేయడం ద్వారానే వ్యాధుల బారిన పడకుండా ఉండొచ్చన్నారు. గ్రామంలో పొక్లెయిన్ సాయంతో చేపడుతున్న పూడిక తీత పనులను ఆమె పరిశీలించి సిబ్బందికి పలు సలహాలు, సూచనలు చేశారు. పంచాయితీ కార్యదర్శులు పారిశుధ్య మురుగుకు చర్యలు చేపట్టాలన్నారు. ఆమె వెంట సర్పంచ్ మందా శాంసన్, ఈఓఆర్డీ రాజు, పంచాయితీ కార్యదర్శి హసీనా బేగం, పులి ప్రసాదరెడ్డి ఉన్నారు.

దొనకొండలో పారిశుధ్య పనులు


జేసీబీతో మురుగు తొలగిస్తున్న కార్యదర్శి

దొనకొండ: స్థానిక వీవీపురం, ముస్లిం బజార్, పోలీస్ స్టేషన్‌కు వెళ్లే దారిలో చాలా రోజుల నుంచి మురుగు నీరు నిల్వ చేరి దుర్వాసన వెదజల్లుతోంది. స్థానికుల అభ్యర్థన మేరకు గ్రామ సర్పంచ్ కొంగలేటి గ్రేస్‌రత్నకుమారి దేవానంద్ ఆదేశాల మేరకు పంచాయతీ కార్యదర్శి ఎస్. డేవిడ్ శుక్రవారం పారిశుధ్య పనులు వేగంగా చేపట్టారు. ఈ సందర్భంగా కాలువ పూడిక తీయించి నీరు నిల్వ ఉండకుండా శుభ్రం చేశారు. వర్షాలు ప్రారంభం కావడంతో అంటు వ్యాధులు ప్రబలే అవకాశముందని పంచాయతీ వారు పారిశుధ్య పనుల్లో నిమగ్నమయ్యారు. ప్రజల విన్నపం అంగీకరించి తక్షణమే మురుగు నీరు తొలగించటంతో సర్పంచ్‌కు, పంచాయతీ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఇన్‌చార్జి తహసీల్దార్‌గా పుల్లారెడ్డి


తహసీల్దార్ పుల్లారెడ్డి

ముండ్లమూరు: మండల ఇన్‌చార్జి తహసీల్దార్‌గా జి.పుల్లారెడ్డి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు తహసీల్దార్‌గా ఉన్న జె.మధుబాబు ఎన్నికల బదిలీల్లో భాగంగా ఇక్కడ పని చేశారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల బదిలీల్లో వచ్చిన వారు తమ స్థానాలకు వెళ్లాలని ఆదేశాలు జారీ చేశారు. అందులో భాగంగా పల్నాడు జిల్లా నూజెండ్లకు బదిలీపై గురువారం వెళ్లడంతో ఆయన స్థానంలో ఇప్పటి వరకు డిప్యూటీ తహసీల్దార్‌గా పని చేస్తున్న పుల్లారెడ్డిని ఇన్‌చార్జి తహసీల్దార్‌గా నియమిస్తూ కలెక్టర్ నుంచి ఆదేశాలు జారీ చేశారు. ఆ మేరకు ఆయన శుక్రవారం బాధ్యతలు చేపట్టారు.

మండల సర్వసభ్య సమావేశం రేపు

ముండ్లమూరు: మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం ఆదివారం ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ జనార్దన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ సుంకర సునీతా బ్రహ్మారెడ్డి అధ్యక్షతన ఆదివారం నిర్వహించే సర్వసభ్య సమావేశానికి మండల స్థాయి అధికారులందరూ తమ శాఖలకు సంబంధించిన పూర్తి సమాచారంతో హాజరు కావాలని చెప్పారు. ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు హాజరు కావాలని ఆయన కోరారు.

రాజీనామా చేయాలంటూ డీలర్లపై ఒత్తిళ్లు


రేషన్ షాపునకు సీసీ కెమెరాలు బిగించిన డీలర్

- రంగంలోకి దిగిన డీటీ అశోక్
- 26 దుకాణాలకు కేటాయించని రేషన్
- పది మంది టీడీపీ మద్దతుదారుల షాపులకు మాత్రమే రేషన్ కేటాయింపు

దర్శి: అధికార పార్టీ నాయకులు రేషన్ డీలర్లను రాజీనామా చేయాలంటూ పౌరసరఫరాల శాఖ డీటీ అశోక్ ద్వారా ఒత్తిళ్లు తీసుకొస్తున్నారు. ప్రతి నెలా 20వ తేదీ నుంచి 25 తేదీ నాటికి అన్నీ దుకాణాలకు రేషన్ సరఫరా చేసేవారు. అయితే ఈ నెల మాత్రం రేషన్ తోలకుండా రాజీనామా చేయాలని డీలర్లపై ఒత్తిళ్లు తీసుకుని రావడం గమనార్హం. రంగంలోకి దిగిన డీటీ అశోక్ అందరు రేషన్ డీలర్లకు తమదైన స్టైల్లో ఒత్తిళ్లు తీసుకొస్తున్నారు. లొంగని వారిని కేసులు రాస్తామని బెదిరిస్తున్నారు. తాము న్యాయంగా రేషన్ ఇస్తుంటే ఎలా కేసులు రాస్తారని కొందరు డీలర్లు డీటీని ప్రశ్నించిన దాఖలాలు ఉన్నాయి. తప్పుడు కేసులు పెడుతారని డీలర్లు సీసీ కెమెరాలు కూడా పెట్టుకోవడం గమనార్హం. దర్శి నియోజకవర్గంలో 26 రేషన్ దుకాణాలు ఉండగా టీడీపీ మద్దతుదారులైన 10 దుకాణాలకు మాత్రమే రేషన్ తోలారు. మిగిలిన 26 దుకాణాలకు ఇప్పటికీ రేషన్ సరఫరా చేయలేదు. దీంతో తమకు రేషన్ తోలుతారా లేదా అనే ఆందోళనలో డీలర్లు ఉన్నారు. ఇదిలా ఉండగా గ్రామీణ ప్రాంతాల్లో రేషన్ షాపులకు అధికార పార్టీలో పోటీ ఎక్కువైంది. తమకంటూ తమకు రేషన్ షాపులు ఇవ్వాలని తమ నియోజకవర్గ అధినేత్రి వద్ద పోటీ పడుతున్నారు. దీంతో వారు కూడా ఏం చేయలేక షాపు ఎవరికి ఇవ్వాలో మీ గ్రామంలో నాయకులు అందరూ మాట్లాడుకుని మీరే తేల్చుకుని రావాలని ఆదేశించినట్లు సమాచారం. ఇదిలా ఉండగా పట్టణంలో గతంలో వైఎస్సార్ సీపీలో ఉంటూ రేషన్ దుకాణం నిర్వహిస్తూ టీడీపీలోకి వెళ్లిన వ్యక్తికి ఎప్పటి నుంచో పార్టీలో ఉంటూ ఉన్న నాయకులకు మధ్య రేషన్ దుకాణం విషయంలో పోటీ పడ్డారు. శుక్రవారం ఆ దుకాణానికి రేషన్ సరఫరా చేసేందుకు లారీ వచ్చింది. వచ్చిన లారీని లోడ్ దింపకుండా టీడీపీకి చెందిన వ్యక్తి నిర్వహిస్తున్న మరో షాపునకు రేషన్ లారీని పంపారు. ఆ షాపు మాకే కావాలంటూ వారు పట్టుబట్టడంతో ఆ షాపును ఎవరు దక్కించుకుంటారా అనే ఆసక్తి నెలకొంది. దీంతో పాటు గతంలో ఉన్న దుకాణదారులు సక్రమంగా ఇంటింటికీ వెళ్లి రేషన్ ఇచ్చి వస్తున్నారు. టీడీపీ నేతలు దుకాణాలు స్వాధీనం చేసుకుంటే అసలు రేషన్ ఇస్తారా లేదా అన్న సందేహాలు ప్రజల్లో వ్యక్తం అవుతున్నాయి. 2014 నుంచి 2019 వరకు ఉన్న టీడీపీ ప్రభుత్వంలో ఎర్రోబనపల్లి, అబ్బాయిపాలెం, దర్శి పట్టణంలో రేషన్ కోసం ధర్నాలు చేసిన సందర్భాలు ఉన్నాయి. కలెక్టర్‌లు స్పందించి అధికారులను ఆదేశిస్తేగానీ రేషన్ పంపిణీ చేయలేదు. అటువంటి వ్యక్తులు మళ్లీ ప్రజలకు రేషన్ ఇస్తారా లేదా అనే భయాందోళనలో ప్రజలు ఉన్నారు. సంబంధిత అధికారులు స్పందించి రేషన్ సరఫరాలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా ప్రజలకు రేషన్ అందించాలని ప్రజలు కోరుతున్నారు. ఇదిలా ఉండగా సరుకు సరఫరా వేగవంతం చేయాలంటూ జిల్లా అధికారులను డీఎస్ఓ ఆదేశాలు జారీ చేస్తున్నారు. తమ జిల్లా సరుకు పంపిణీలో 11వ స్థానానికి పడి పోయిందని, ఇలా నిర్లక్ష్యం చేస్తే 31వ తేదీ నాటికి సరుకు రేషన్ షాపులకు ఎలా పంపిణీ చేస్తారని అధికారులను సైతం హెచ్చరిస్తున్నారు. ఈ విషయంపై రేషన్ డీటీ అశోక్‌ను వివరణ కోరేందుకు ఫోన్‌లో సంప్రదించగా ఆయన స్పందించడం లేదు.

అలనాటి ఆటల్లో మహిళల నిమగ్నం

పుల్లలచెరువు: వర్షాకాలం ప్రారంభమైనా చాలా గ్రామాల్లో వ్యవసాయ పనులు ఇంకా ప్రారంభం కాలేదు. మరోవైపు తుఫాన్ ప్రభావంతో వాతావరణం చల్లబడింది. ఎక్కడికీ బయటకు వెళ్లలేని పరిస్థితి. ఇంట్లో పిల్లలతో సరదాగా గడుపుదామంటే వారు సెల్‌ఫోన్‌ల్లో బిజీబిజీ. దీంతో పెద్దవారు గుంపుగా బారాకట్ట, పులిజూదం ఆడుతూ ఆలనాటి ఆటలను గుర్తు చేశారు. ఈ దృశ్యాలు పుల్లలచెరువు, కోత్తూరు గ్రామాల్లో కనిపించాయి.

కౌలు రైతులకు బ్యాంకులో రుణాలివ్వాలి


మేనేజర్‌కు కౌలు రైతుల జాబితా అందిస్తున్న ఏఓ బుజ్జిబాయి

పెద్దారవీడు: కౌలు రైతులకు సాగు చేసిన పంటలపై బ్యాంకుల్లో రుణాలు మంజూరు చేయాలని ఏఓ కె.బుజ్జిబాయి తెలిపారు. మండలంలో గొబ్బూరు, దేవరాజుగట్టు గ్రామాల కౌలు రైతుల జాబితాను దేవరాజుగట్టులో కెనరా బ్యాంక్ మేనేజర్‌కు శుక్రవారం ఆమె అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అర్హత కలిగిన కౌలు రైతులకు సీసీఆర్‌సీతో ప్రభుత్వం ద్వారా రాయితీ, నష్టపరిహారం, బ్యాంకు రుణాలు వంటివి ఎంతో ప్రయోజనాలు వర్తిస్తాయన్నారు. సొంత భూమి లేని రైతులు తోటి రైతుల నుంచి కౌలుకు తీసుకున్న వారికి 11 నెలలు అగ్రిమెంట్‌తో సీసీఆర్‌సీ ఇస్తామన్నారు. సొంత భూమి సాగుదారులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు. అర్హులైన కౌలు రైతులందరికీ సాగు పత్రాలు అందించి, ప్రభుత్వ పథకాల ద్వారా కలిగే లబ్ధి వర్తించేలా కృషి చేస్తామన్నారు.

అమర వీరులకు నివాళి


మాట్లాడుతున్న తిండి నారాయణరెడ్డి

దొనకొండ: స్థానిక ఆనంద ఆశ్రమంలో బీజేపీ సమావేశం ఆ పార్టీ మండల అధ్యక్షుడు పోతురాజు వెంకటరామయ్య అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా ఉపాధ్యక్షుడు తిండి నారాయణరెడ్డి హాజరై మాట్లాడారు. కార్గిల్ విజయ దివస్ సందర్భంగా అమర వీరులను స్మరించుకుంటూ కొన్ని నిమిషాల పాటు మౌనం పాటించారు. ఈ సందర్భంగా నారాయణరెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో ఉపాధి హామీ పథకాన్ని ఉపయోగించుకుని గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి చెందే విధంగా అధిక నిధులు కేటాయించటం, ప్రతి పేదవాడికి కేంద్ర ప్రభుత్వం యొక్క సంక్షేమ పథకాలు అందే విధంగా బడ్జెట్ రూపకల్పన చేశారని చెప్పారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేసుకున్నారు. రాష్ట్ర కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడు ఉన్నం శ్రీనివాసులు, దర్శి రూరల్ మండలం బీజేపీ అధ్యక్షుడు కాకర్ల సాయి పాల్గొన్నారు.

సాంకేతికతను విద్యార్థులు అందిపుచ్చుకోవాలి


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ప్రిన్స్‌పాల్

పుల్లలచెరువు: విద్యార్థులు సాంకేతికతను అందిపుచ్చుకోవాలని కేజీబీవీ ప్రిన్సిపాల్ లిల్లీ ప్రకాశ్ వాణీ అన్నారు. శిక్ష సప్తాహ్ వారోత్సవాల్లో భాగంగా ఐదో రోజు శుక్రవారం విద్యార్థులకు డిజిటల్ విద్య ఆవశ్యకతను తెలియచేశారు. ఆమె మాట్లాడుతూ మారుతున్న కాలానుగుణంగా విద్యార్థి చదువుతో పాటు సాంకేతికతను కూడా అందిపుచ్చుకోవాలని, ఇంటర్నెట్ వినియోగంతో విద్యార్థి తన సందేహాలను నివృతి చేసుకుంటూ అభివృద్ధి దిశలో పయనించాలని కోరారు. నిత్య జీవితంలో మొబైల్, ఇంటర్నెట్ వినియోగంపై అవగాహన పెంచుకుంటే రకరకాల విద్య, ఉద్యోగ అవకాశాలు లభిస్తున్నాయని, అన్ని రంగాల్లో స్వయం ఉపాధి అవకాశాలు పెరిగాయన్నారు. ప్రతి ఒక్కరూ సాంకేతికతను ఉపయోగంచుకుంటూ డిజిటల్ రంగంలో ముందుండాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా పాఠశాలల్లోని ఐఎఫ్‌పీల వినియోగం గురించి, ట్యాబ్‌ల గురించి అవగాహన కల్పించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

108లో గర్భిణి ప్రసవం


108లో ప్రసవించిన ఆదిలక్ష్మి

పుల్లలచెరువు: 108లో పండంటి మగబిడ్డకు జన్మనించింది ఓ తల్లి. మండలంలోని మానేపల్లి గ్రామానికి చెందిన తమటం ఆదిలక్ష్మి (27) ప్రసవ వేదన ఎక్కువగా ఉండటంతో భర్త కోటిరెడ్డి 108 వాహనానికి ఫోన్ చేసి సమాచారం ఇచ్చాడు. స్పందించిన 108 సిబ్బంది మానేపల్లి వచ్చి గర్భిణిని ఎక్కించుకుని సమీపంలోని త్రిపురాంతకం వైద్యశాలకు వెళ్లి చికిత్స చేయించారు. వైద్య సిబ్బంది మెరుగైన వైద్యం కోసం ఎరియా వైద్యశాల ఉన్న యర్రగొండపాలేనికి రిఫర్ చేయడంతో వారు అక్కడి నుంచి బయల్దేరారు. కొంతదూరం వచ్చే సరికి నొప్పులు ఎక్కువ కావడంతో టెక్నీషియన్ గాలిరెడ్డి, పైలట్ శ్రీను అంబులెన్స్‌లోనే సుఖప్రసవం చేయించారు. పండంటి మగ బిడ్డకు జన్మనిచ్చింది ఆదిలక్ష్మి. దీంతో కుటుంబ సభ్యులు, బంధువులు 108 సిబ్బందికి అభినందనలు తెలిపారు.

వైభవంగా సంస్కృతి దీక్ష యజ్ఞం


చండీ హోమానికి హాజరైన భక్తులు

త్రిపురాంతకం: విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో సంస్కృతి దీక్ష యజ్ఞం శ్రీకార్యసిద్ధి గణపతి మందిరం చండీ మాత వద్ద చండీ హోమం భక్తజనులుచే పండితులు శుక్రవారం నిర్వహించారు. త్రిపురాంతకం ఆలయం వద్ద జరిగిన ప్రత్యేక పూజల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. పండితులు విశ్వం, వెంకట సుబ్బయ్య, రవిస్వామి హోమం, ప్రత్యేక పూజల అనంతరం ఆశిర్వచనం ప్రసాదాలు, స్వామి అమ్మవార్ల చిత్ర పటం అందజేశారు. వీహెచ్‌పీకి చెందిన ప్రముఖులు నర్రా వెంకటరెడ్డి, అంకాలయ్య, బ్రహ్మానందరెడ్డి, గురుస్వామి, సందీప్, వీరారావు, వెంకటరాములు, టి.మల్లారెడ్డి, రాధాకృష్ణమూర్తి, సుబ్రహ్మణ్యం, నాగిరెడ్డి, రమణారెడ్డి, వీరపనాయుడు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం రుచిగా, శుచిగా ఉండాలి


మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేస్తున్న ఎంఈవోలు

పుల్లలచెరువు: పాఠశాలల్లో విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనం రుచిగా, శుచిగా ఉండాలని ఎంఈవోలు శామ్యూల్‌జాన్, ఇందిరాప్రసాద్ అన్నారు. శుక్రవారం వారు పలు పాఠశాలల్లో అమలవుతున్న మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముందుగా ప్రభుత్వం నిర్దేశించిన మెనూను అమలు చేయాలని, భోజనం రుచిగా, పరిశుభ్రమైన ప్రదేశంలో తయారు చేయాలన్నారు. ప్రతి పాఠశాలలో ఉపాధ్యాయులు భోజనం తయారైన తర్వాత రుచికరంగా ఉంటేనే విద్యార్థులకు అందజేయాలన్నారు. రుచిలో, నాణ్యతలో తేడాలు ఉంటే ఆ పాఠశాల హెచ్ఎం, ఉపాధ్యాయులు ఇబ్బందులు పడతారని హెచ్చరించారు. పాఠశాలల్లో ముఖ్యంగా విద్యార్థుల సామార్థ్యాలపై దృష్టిపెట్టాలన్నారు.